క్లుప్తంగా

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో వ్యవహరించాలి

కంచికచర్ల(వీరులపాడు): క్రీడలలో పాల్గొనే క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో నడుచుకోవాలని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. కంచికచర్ల పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జైభీమ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ భానుడి ప్రతాపం అధికంగా ఉందని, క్రీడాకారులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం కొద్ది సేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది శ్రీనివాస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, పలువురు నిర్వాహకులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఏపీ గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో మూడవ తరగతి ప్రవేశాలకు, 4 నుంచి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న ఖాళీలను భర్తీ చేయటానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.ఉమేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన గిరిజన బాలురు ఈనెల 30 లోపు వారి దరఖాస్తులను పాఠశాలలో అందించాలన్నారు. వివరాలకు 94409 19879 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పారిశుద్ధ్య మెరుగుదలకు ప్రజలు సహకరించాలి

నందిగామ: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందజేయాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సూచించారు. పట్టణంలోని 20 వ వార్డులో గురువారం ఆయన పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా డ్రెయిన్లలో పూడిక తీతలు, పిచ్చి మొక్కల తొలగింపు, బ్లీచింగ్ చల్లించడం, ఫాగింగ్ తదితర కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు కూడా సహకరిస్తే పట్టణాన్ని స్వచ్ఛ నందిగామగా తీర్చిదిద్దవచ్చునన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ రవీంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించుకోవాలి

పెనుగంచిప్రోలు: విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకోవాలని పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు గ్రంథాలయాధికారులు ఇంజం మధు, మధుబాబు అన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం విద్యార్థులతో కథలు చదివించటం, నీతి వాక్యాలు చెప్పించటంతో పాటు కార్టూన్లు, గ్రంథ పఠనం వలన కలిగే లాభాలను వివరించారు. కథల పుస్తకాలు చదవటం, వినటం వలన నైతిక విలువలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి

పెనుగంచిప్రోలు: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు జగ్గయ్యపేట సీఐ ఎం.జానకిరామ్ తెలిపారు. ఆయన గురువారం మండల కేంద్రం పెనుగంచిప్రోలుతో పాటు పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలోని జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శ్రీతిరుపతమ్మ ఆలయ దర్శనానికి వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారని, వందల సంఖ్యలో వాహనాలు వస్తాయని దీనికోసం ట్రాఫిక్‌పై ప్రధానంగా దృష్టి పెడతామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సీహెచ్‌కే దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన ప్రతిష్ఠా మహోత్సవాలు

నందిగామ: పట్టణంలోని కృష్ణబలిజనగర్‌లోని శివ నాగేంద్ర స్వామి వారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు జరిగే ఈ మహోత్సవాలలో భాగంగా మొదటి రోజు ప్రతిష్ఠించనున్న శివ నాగేంద్ర స్వామి, గణపతి, కుమారస్వామి, ఆదిశేషువు, శివలింగం, నందీశ్వరుల విగ్రహాలకు పలు విశేష పూజలు నిర్వహించారు.

ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్ల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని జగ్గయ్యపేట పట్టణ ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇనపనుర్తి యోహాను, కోనేరు సత్యనారాయణ గురువారం ఒక ప్రకటన ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైవేటు ఎలక్ట్రికల్ కార్మికుల సంక్షేమ సమగ్ర సర్వే యాత్ర–2 త్వరలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేషన్ ద్వారా పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 5 లక్షల మంది ప్రైవేటు ఎలక్ట్రికల్ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు.

పట్టణ ప్రజల ఆరోగ్యానికి జవసత్వాలు

జగనన్న కాలనీలో రూ.80 లక్షలతో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం

జగ్గయ్యపేటఅర్బన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాల సాధనలో భాగంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య ఆరోగ్యశాఖ చరిత్రలోనే చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా అనేక విప్లవాత్మక సంస్కరణలు చేపట్టారు. అందులో భాగంగా పట్టణ వాసుల శ్రేయస్సుకు పట్టం కట్టేందుకు వినూత్నంగా ప్రతి 25 వేల జనాభాకు ఒక డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటుచేస్తున్నారు. ప్రతి రెండు కి.మీ లకు ఒక అర్బన్ హెల్త్ సెంటర్‌ను నిర్మించి పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు అందుబాటులోకి తేవాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. అందుకు ఒక్కో అర్బన్ హెల్త్ సెంటర్‌కు రూ.80 లక్షల చొప్పున కేటాయించి భవన నిర్మాణాలను చేపట్టారు.

ఆధునిక వైద్య సేవలు అందించేందుకు సకల సౌకర్యాలు

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలోని పీపీ యూనిట్ పర్యవేక్షణలో ఉండే హెల్త్ సెంటర్లు మొత్తం ఏడు గదులతో నిర్మాణం జరిగాయి. వీటిలో ప్రతి రోజూ ఓపీ చూడటంతో పాటు మైనర్ ఆపరేషన్లకు ఆపరేషన్ థియేటర్, ల్యాబ్ గది, ఫార్మసీ రూమ్(మందుల గది), 10 మంచాలు పట్టే విధంగా జనరల్ వార్డు హాలు, డెలివరీ రూమ్, మీటింగ్ హాల్, డాక్టర్స్ రూమ్ ఏర్పాటుచేశారు. వీటిలో ప్రస్తుతానికి ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, ఒక స్టాఫ్ నర్స్, ఒక ఫార్మసిస్ట్, ఏఎన్‌ఎంలు ఏడుగురు, 11 నుంచి 13 మంది ఆశ వర్కర్లు పనిచేయనున్నారు.



పేటలోని బలుసుపాడు రోడ్‌లో జగనన్న కాలనీలో నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్

పేటలో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు ప్రారంభోత్సవానికి సిద్ధం

జగ్గయ్యపేట మున్సిపాలిటీ పరిధిలో బలుసుపాడు రోడ్‌లో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీలో ఒకటి, తొర్రగుంటపాలెంలో స్థానిక చిల్లకల్లు రోడ్‌లో ఎస్‌జీఎస్ కళాశాల ఎదురుగా ఒకటి చొప్పున రెండు వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించారు. వీటిలో చిల్లకల్లు రోడ్‌లో అర్బన్ హెల్త్ సెంటర్ గతంలోనే పూర్తి కాగా, జగనన్న కాలనీలో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం ఇటీవలే పూర్తయింది. వీటి నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తయ్యేలా చేశారు. అన్ని పనులు పూర్తి చేసుకొని ఈ నెలాఖరుకు గాని, జూన్ నెల ఆరంభంలో గాని ప్రారంభించడానికి ఎమ్మెల్యే ఉదయభాను సన్నాహాలు చేస్తున్నారు.



నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

పట్టణ ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటుచేసింది. దీనిలో మైనర్ ఆపరేషన్ల సౌకర్యంతో పాటు ప్రతి రోజు ఓపీ చూడడం, గర్భిణులకు ప్రసవాలు, ఆపరేషన్లు చేయడం వంటి సౌకర్యాలు కల్పిస్తారు. ఇద్దరు వైద్యులు, నర్సుల పర్యవేక్షణతో సేవలందిస్తారు.

–జి.నాగరాణి, వైద్యాధికారి, పీపీ యూనిట్, జగ్గయ్యపేట



ప్రజలకు చేరువలో వైద్య సేవలు

పట్టణ ప్రజలకు చేరువలో మెరుగైన వైద్య సేవలందించేందుకు ఇలాంటి అర్బన్ హెల్త్ సెంటర్‌లు ఏర్పాటుచేయడం హర్షణీయం. వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులు అందజేయడం సంతోషదాయకం. ప్రతి రెండు కి.మీకు ఇలాంటి సౌకర్యం కల్పించినందుకు సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాం.

–దేవనపల్లి వరలక్ష్మి, జగనన్న కాలనీ, బలుసుపాడు రోడ్, జగ్గయ్యపేట

పేదలకు సైతం కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు

ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను



కొండూరు గ్రామంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

నందిగామ: పేదలకు సైతం కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని నందిగామ మండలం కొండూరు గ్రామానికి చెందిన బెల్లంకొండ చిన్న ప్రకాష్ రావు అనారోగ్యంతో బాధపడుతూ శస్త్ర చికిత్స చేయించుకున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) ద్వారా మంజూరైన రూ.3.60 లక్షల చెక్కును గురువారం సామినేని ఉదయభాను అందజేశారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, పార్టీ ఏటి పట్టు గ్రామాల నాయకులు మేడా కోటేశ్వరరావు, అప్పిగట్ల సురేష్ బాబు, దేవినేని నాగేశ్వరరావు, చెరుకూరి బ్రహ్మం, చావా సురేష్, ఆంజనేయులు, పూర్ణయ్య, రాంబాబు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు: రాష్ట్రాభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లనే సాధ్యమని శాసన సభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని దొడ్డదేవరపాడు గ్రామంలో గురువారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించటంతో పాటు ప్రజా సమస్యలను తెలుసుకుని సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం అగ్రపథంలో ఉందన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా కులమతాలు, పార్టీలు, రాజకీయాలతో ప్రమేయం లేకుండా అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. అవినీతికి తావు లేకుండా పారదర్శక పాలన అందించటంతో పాటు సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాకు జమ చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని కొనియాడారు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు తోట నారాయణరావు, సర్పంచ్ చెండ్యాల రామకృష్ణ, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, నాయకులు జమ్ముల వరబాబు, వెంకటేశ్వరరావు, నాగరాజు, పలువురు నాయకులు, వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



దొడ్డదేవరపాడు గ్రామంలో గడపగడపలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చెరువు అలుగు వద్ద రూ.30 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం

ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని చెరువు కట్టమీద ఉన్న ఆంజనేయస్వామి వారి దేవాలయం సమీపంలో ఊర చెరువు అలుగు వద్ద 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ.30 లక్షలతో నిర్మించనున్న నూతన బ్రిడ్జి నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో భాగంగా స్థానిక 13, 15 వార్డుల ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేందుకు ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. గతంలో ఈ బ్రిడ్జి రెండు మీటర్ల వెడల్పుతో ఇరుకుగా ఉండటం వలన 13, 15 వార్డుల ప్రజలు వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారని తెలిపారు. దీంతో స్థానికుల అభ్యర్థనతో పాటు స్థానిక నాయకుల సూచనల మేరకు 30 మీటర్ల పొడవున, 6 మీటర్ల వెడల్పుతో విశాలమైన బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నిర్మాణ పనులు రెండు నెలల్లో పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ తన్నీరు నాగమణి, కోఆప్షన్ సభ్యులు షేక్ ఖాదర్‌బాబు, సాయిచైతన్య శర్మ, వైఎస్సార్ సీపీ నాయకులు తన్నీరు నాగేంద్ర, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, కాశి కిషోర్, పూసల పుల్లారావు, దువ్వల రామకృష్ణ, స్థానిక నాయకులు వేముల విజయ్, యానాదిరావు, మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు, డీఈఈ శివకోటేశ్వరరావు, ఏఈ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా నిర్మించనున్న బ్రిడ్జి శంకుస్థాపనలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఉదయభాను తదితరులు

నాట్య కళాపీఠాన్ని సందర్శించిన న్యాయమూర్తి



కూచిపూడి(మొవ్వ): పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్యకళాపీఠాన్ని నందిగామ సబ్ జడ్జి ఖాసిం గురువారం కుటుంబ సభ్యులతో సందర్శించారు. కళాపీఠం ప్రిన్స్‌పాల్ వేదాంతం రామలింగ శాస్త్రి ద్వారా కూచిపూడి నాట్య విశేషాలను, చరిత్రలో నిలిచిపోయిన నాట్య కళాకారుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కళాపీఠం విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నాట్యాంశాలను వీక్షించారు.

రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు

లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా సీహెచ్‌సీ గ్రూపుల రైతులకు రాయితీపై ప్రభుత్వం మంజూరు చేసిన వ్యవసాయ యంత్ర పరికరాలను గురువారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అన్ని రకాలుగా అండగా ఉంటున్నారన్నారు. మండలంలోని పల్లగిరి గ్రామంలోని సీహెచ్‌సీ గ్రూపులకు రూ.11.49 లక్షల విలువ చేసే వ్యవసాయ యంత్ర పరికరాలను 40 శాతం రాయితీపై అందించామని తెలిపారు. రైతులకు సాగు ఖర్చులకు రైతు భరోసా పథకం ద్వారా సాగు ప్రారంభానికి ముందే పెట్టుబడి ఖర్చులకు ఆర్థిక సహకారం అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి వ్యవసాయంలో సాగు మెలకువలపై అవగాహన కలిగించటంతో పాటు కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను రాయితీపై అందిస్తూ రైతులను ఆదుకుంటున్నారని గుర్తు చేశారు.

కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైస్ చైర్మన్ నల్లమల్లి మురళి, జెడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, ఎంపీపీ అరిగెల సుందరమ్మ, నాయకులు పాకాలపాటి కిరణ్, యాకుబ్ అలీ, దాసు, గరికపాటి భాస్కరం తదితరులు పాల్గొన్నారు.



రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

త్వరలో అందుబాటులోకి ఈతకొలను

- మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర
- స్విమ్మర్లకు క్రీడా దుస్తులు అందజేత

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో ఉన్న ఈతకొలను(స్విమ్మింగ్ పూల్)ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి అతి త్వరలో ప్రజలకు ఉపయోగంలోకి తీసుకువస్తామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఈనెల 27, 28 తేదీల్లో సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగే 8 వ జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు వెళుతున్న జగ్గయ్యపేటకు చెందిన డ్రీమర్స్ స్విమ్మర్స్ అసోసియేషన్ ద్వారా శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు గురువారం మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ శివారు లోని పాలేటి ఒడ్డున ఉన్న డీఎస్‌ఏ స్విమ్మింగ్ ఘాట్ వద్ద ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతూ ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీలకు మన జగ్గయ్యపేట నుంచి స్విమ్మింగ్ కోచ్‌లు పొట్టాబత్తిన పాండురంగారావు, లక్ష్మి శిక్షణలో పలువురు స్విమ్మర్లు పాల్గొనడం అభినందనీయమన్నారు. సబ్ జూనియర్స్, జూనియర్స్‌లో బాలబాలికలు, మాస్టర్స్‌లో మహిళలు, పురుషులు కలిపి మొత్తం 19 మందికి చైర్మన్ తన సొంత ఖర్చుతో క్రీడా దుస్తులు అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మండదపు శ్రీనివాసరావు, కలాలి నరేష్, టీమ్ మేనేజర్ కల్యాణ్, అసోసియేషన్ పెద్దలు యలదండి శ్రీనివాసరావు, ఆకుల స్వాతి కుమార్, కుర్రా శ్రీనివాస్, చారుగుండ్ల రాజేశ్వరరావు, వల్లూరి రాధాకృష్ణ, కృష్ణా స్విమ్మర్స్ పూర్వ అధ్యక్షుడు చెరుకూరి రమేష్ పాల్గొన్నారు.



స్విమ్మర్లకు క్రీడాదుస్తులు అందజేసిన మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తదితరులు

ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు

జగ్గయ్యపేటఅర్బన్: జూన్ 5 వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు మున్సిపాలిటీలలో మేరా లైఫ్ మేరా స్వచ్ఛనగర్ రెడ్యూస్–రీసైకిల్–రీయూజ్(ఆర్‌ఆర్‌ఆర్) పురస్కరించుకుని ఈనెల 17 నుంచి జూన్ 4 వ తేదీ వరకు పట్టణంలో ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లను ఏర్పాటుచేసినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ మల్లేశ్వరరావు గురువారం తెలిపారు. ఒకటవ సచివాలయం పాత గురుకుల పాఠశాల, మూడవ సచివాలయం పాత మున్సిపల్ కార్యాలయం, తొమ్మిదవ సచివాలయం పాతపేట గడ్డ వద్ద ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. తమ గృహాలలో నిరుపయోగంగా ఉన్న వస్తువులను ఈ సెంటర్‌లో అందిస్తే వాటి అవసరం ఉన్న ఇతరులకు అందజేస్తారని తెలిపారు. ఇలాంటి సేవా అవకాశం కల్పిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సేవలకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

ఊపందుకున్న అభివృద్ధి పనులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారి ఆలయానికి సంబంధించిన అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. సుమారు రూ.13.5 కోట్లతో జరగనున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపన చేశారు. ఉమ్మడి జిల్లాలో విజయవాడ దుర్గ గుడి తరువాత స్థానంలో పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ వారి ఆలయం ఉంది. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా, లక్షలాది మంది భక్తుల ఇలవేల్పుగా తిరుపతమ్మ ఆలయం వర్ధిల్లుతోంది. ఆలయ వార్షికాదాయం రూ.8 కోట్ల పైనే ఉంది. నిత్యం వేల సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తరిస్తుంటారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సారథ్యంలో సుమారు రూ.5 కోట్లతో బేడా మండపం, రాజగోపురంతో పలు అభివృద్ధి కార్యక్రమాల నిర్మాణం జరిగింది. తిరిగి మరలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఉదయభాను సారథ్యంలో సుమారుగా రూ.13.5 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఆలయం వద్ద కేశఖండనశాల, టాయిలెట్ బ్లాక్, మునేరు అవతల షెడ్లు, గదుల నిర్మాణానికి సంబంధించి పనులు ప్రారంభమయ్యాయి. వీటి నిర్మాణంపై ఆలయ అధికారులు, పాలకవర్గం కూడా ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు. ఆలయ ఈఈ వైకుంఠరావు మాట్లాడుతూ ప్రస్తుతం అమ్మవారి మామిడి తోటలో షెడ్లు, గదుల నిర్మాణంతో పాటు ఆలయం వద్ద కేశ ఖండనశాల, టాయిలెట్ బ్లాక్ పనులు ప్రారంభమయ్యాయి. ఆలయం వద్ద డార్మెటరీ, అమ్మవారి వార్షిక కల్యాణ స్థలం వద్ద అభివృద్ధి పనులు కూడా త్వరలో ప్రారంభమవుతాయి.



అమ్మవారి మామిడి తోటలో షెడ్ల నిర్మాణానికి పూర్తయిన బేస్‌మెంట్

మరియమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: వేసవిలో చలివేంద్రాలను ఏర్పాటు చేయటం వల్ల పాదచారుల దాహార్తిని తీర్చవచ్చని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. కస్తాల మరియమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భానుడి ప్రతాపం అధికంగా ఉందని, ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా అవసరమైతేనే బయటకు రావాలని, బయటకు వచ్చిన సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తమ తల్లి కస్తాల మరియమ్మ పేరుతో పట్టణంలోని రైతుపేట, గాంధీ సెంటరు, టీటీడీ కల్యాణ మండపం, రామన్నపేట రోడ్డు, పాతబస్టాండ్ ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయటం సంతోషంగా ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సైతం ఆయా గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఎంపీపీ అరిగెల సుందరమ్మ, మున్సిపల్ కమిషనర్ జయరాం, ఏఈ ఫణిశ్రీనివాస్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిగామ: పట్టణంలోని పలు ప్రాంతాల పరిధిలో శుక్రవారం నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ దిబ్బయ్య గురువారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్‌ల మరమ్మతుల నేపథ్యంలో పట్టణంలోని రామన్నపేట రోడ్, బీసీ కాలనీ, జానకి రామయ్య కాలనీ, చిన్న మసీదు రోడ్డు, నెహ్రూ నగర్, చెరువు బజార్, టీబీ రోడ్డు, కాకుళయ్య బజార్ తదితర ప్రాంతాలలో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు గణితంలో శిక్షణ

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్–1 స్థాయి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులతో కథల పుస్తక పఠనం చేయించారు. ఉపాధ్యాయుడు టి.ప్రసాద్‌బాబు వేద గణితంలో మెలకువలు నేర్పించారు. 1 నుంచి 100 వరకు ఎక్కాలు చదవకుండా సులువుగా లెక్కలు చేసే పద్ధతిని నేర్పించారు. ఉపాధ్యాయుడు వినోద్‌కుమార్ ఇంగ్లిషు గ్రామర్‌లో వెర్బ్(సహాయ క్రియ) గురించి నేర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, తెలుగు ఉపాధ్యాయుడు డి.నాగేశ్వరరావు, గ్రంథాలయ బీడీసీ మల్లిక, సిబ్బంది శ్యామల,సత్యావతి పాల్గొన్నారు.



పేట గ్రంథాలయంలోని సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులకు గణితంలో శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

గౌరవరం(జగ్గయ్యపేట): ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పీఏసీఎస్ చైర్మన్ బాలసైదా అన్నారు. గ్రామంలో జగ్గయ్యపేట సెక్షన్ అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులను కాపాడుకోవాలని, నీటిని పొదుపు చేయాలన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ నియంత్రణకు కృషి చేయాలన్నారు. కాలుష్యం బారి నుంచి భూమిని కాపాడుకోవాలన్నారు. చెత్త నుంచి ఉత్పత్తి కేంద్రాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ అధికారి నాగేశ్వరరావు, ప్రసన్నలీలా, నాయకులు జగదీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయాల్లో మాస శివరాత్రి పూజలు

నందిగామ: మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు శివాలయాల్లో గురువారం విశేష పూజలు జరిగాయి. పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన కూడలి సంగమేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. వీటితోపాటు పట్టణ శివారు పల్లగిరిగుట్టపై గల శివలింగం వద్ద, మున్నేటి తీరానగల విజ్ఞాన నందీశ్వర స్వామి వారి ఆలయం వద్ద భక్తులు స్వయంగా అభిషేకం చేసుకునే అవకాశం ఉండడంతో పలు గ్రామాలకు చెందిన భక్తులు వేకువజామునే ఆలయాలకు వచ్చి అభిషేకాలు చేసుకున్నారు.